

ఊరిస్తున్న మబ్బులు

మబ్బులు ఊరిస్తున్నాయి..వాన ఎప్పుడు కురుస్తుందోనని రైతులు ఆకాశం వైపు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. 8లో▸



విద్యారంగ సమస్యలు..

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన వ్యక్తం చేశారు. 8లో▸



బీఆర్ఎస్‌కే ప్రజల మద్దతు

రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ పాలనే కావాలని ప్రజలు కోరుకుంటున్నారని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం



ఇబ్రహీంపట్నం రూరల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నేతలు కలిసి ఘన స్వాగతం పలికారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో సోమవారం జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన సీఎంకు ఆదిబట్ల మున్సిపల్ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేశారు.

శంకర్‌పల్లికి వచ్చిన ప్రముఖ దర్శకుడు వీవీ వినాయక్



శంకర్‌పల్లి: ప్రముఖ సినీ దర్శకుడు వీవీ వినాయక్ సోమవారం శంకర్‌పల్లి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చారు. మొయినాబాద్ మండలం చిన్నమంగళారం గ్రామ పరిధిలోని సుమారు 2000 వేల గజాల ఇంటి స్థలాన్ని అమ్మేందుకు వచ్చినట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి. దర్శకుడు వచ్చిన విషయం తెలియడంతో పలువురు ఆయనతో ఫొటోలు దిగేందుకు ఆసక్తి కనబరిచారు.

విద్యార్థులు యుద్ధ విద్యల్లో రాణించాలి



విద్యార్థినులను సత్కరిస్తున్న అధ్యాపకులు

షాద్‌నగర్: విద్యార్థులు యుద్ధ విద్యల్లో రాణించాలని స్కూల్ స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తిన చెన్నయ్య ఆకాంక్షించారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర పాఠశాలల క్రీడల కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 12వ సౌత్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పట్టణంలోని గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులు గీత వెండి పతకం, ఐశ్వర్య రజిత పతకం సాధించారు. వారిని సోమవారం కళాశాలలో సత్కరించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతోపాటు, ఆటలు, యుద్ధ విద్యలు అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శైలజ, వైస్ ప్రిన్సిపాల్ జ్యోతి, పీడీ రేణుక, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య తదితరులు

తుర్కయంజాల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. పురపాలక సంఘం పరిధి తుర్కయంజాల్‌లోని హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వనమహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. కార్యక్రమంలో కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షురాలు, మాజీ కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ, నాయకులు తాటిచెట్టు అశోక్ గౌడ్, తూళ్ల నర్సింహ గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు గౌని రాజు గౌడ్, మాజీ అధ్యక్షుడు వెంకటేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విన్నపాలు.. బుట్టదాఖలు

'ప్రజావాణి'కి జనాల బారులు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- వారం వారం అర్జీల వెల్లువ
- అపరిష్కృతంగానే సమస్యలు
- కలెక్టర్ ఆదేశించినా పట్టని క్షేత్రస్థాయి అధికారులు
- ప్రదక్షిణలు చేస్తున్న బాధితులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా/ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న 'ప్రజావాణి' జిల్లాలో ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాధితుల నుంచి అర్జీలు స్వీకరించడం.. ఆన్‌లైన్‌లో నమోదు చేయడం మినహా శాశ్వత పరిష్కార మార్గం చూపడం లేదనే అపవాదు లేకపోలేదు. కలెక్టరేట్ చుట్టూ తిరిగి తిరిగి మోకాళ్లు అరుగుతున్నాయే కానీ.. సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని బాధితులు వాపోతున్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ పదేపదే చెబుతున్నా.. ఆయా శాఖల అధికారులు మాత్రం పెడచెవిన పెడుతూనే ఉన్నారు. ఫలితంగా అనేక వ్యయ ప్రయాసలకోర్చి సుదూర ప్రాంతాల నుంచి ఉదయాన్నే కలెక్టరేట్‌కు చేరుకుంటున్న బాధితులు ఉసూరుమంటున్నారు. సాధారణంగా ప్రతి వారం 60 నుంచి 70 దరఖాస్తులు వస్తుండగా, తాజాగా ఈ వారం 152 అర్జీలు అందడం గమనార్హం. వీటిలో భూ సంబంధిత ఫిర్యాదులు 130 వరకు ఉండగా, ఇతర శాఖలకు సంబంధించినవి 22 వరకు ఉన్నాయి.

ఎనిమిదేళ్లుగా తిరుగుతున్నా



ఇబ్రహీంపట్నం మండలం నెర్రపల్లిలోని సర్వే నంబర్ 262లో 6.20 ఎకరాల పట్టా భూమి ఉంది. రెవెన్యూ రికార్డుల్లో భూదాన్ భూమిగా రికార్డైంది. ప్రస్తుతం నా వయసు 70 ఏళ్లు. ఎటూ నడవలేకపోతున్నా. రికార్డుల్లో దొర్లిన తప్పును సరి చేయాలని ఎనిమిదేళ్లుగా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా. తిరిగి తిరిగి నా మోకాళ్లు అరిగిపోయాయే కానీ సమస్య మాత్రం పరిష్కారం కాలేదు.

– గుడ్ల సాయిలు యాదవ్, నెర్రపల్లి

20 సార్లు ఫిర్యాదు చేశా



తలకొండపల్లి మండలం గట్టుఇప్పలపల్లి సర్వే నంబర్ 550, 542లలో 9.4 ఎకరాల పట్టా భూమి ఉంది. నా భూమికి ఆనుకుని సర్వే నంబర్ 550లో సీలింగ్ భూమి ఉంది. రెవెన్యూ రికార్డుల్లో సీలింగ్ భూమిని పట్టా భూమిగా మార్చి.. పట్టా భూమిని సీలింగ్ భూమిగా మార్చారు. నాకు రెండు కాళ్లు పని చేయడం లేదు. వీల్‌చైర్‌లో కలెక్టరేట్‌కు రావాల్సి వస్తోంది. ఇప్పటికే 20 సార్లు వచ్చి పోయాను.

– గోవింద కృష్ణయ్య, గట్టుప్పలపల్లి

ఇల్లు కట్టుకోనిస్తలేరు



1992లో షాబాద్ మండలం ముద్దంగూడలో ఇందిరమ్మ ఇల్లు ఇచ్చారు. ఇప్పటి వరకు అదే ఇంట్లో ఉన్నాం. ప్రస్తుతం ఇల్లు శిథిలావస్థకు చేరింది. ఇటీవల ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. పునాదులు తవ్విన తర్వాత.. అది తమ స్థలం అని కొంత మంది అడ్డుకుంటున్నారు.

– భిక్షపతి,రాజేశ్వరి దంపతులు

న్యాయం చేయకుంటే చావే శరణ్యం



మూడు ఎకరాలకు రెండు ఎకరాలు విక్రయించాం. మరో ఎకరం పొజిషన్‌లో ఉంది. రికార్డుల్లో పేరు రాకపోవడంపై ఆరా తీస్తే మాకు అసలు భూమే లేదంటున్నారు. చుట్టూ పలకలు వేసి ఆక్రమించుకున్నారు. మా కుమారుడుని కొట్టి మతిస్థిమితం లేని వాడిగా చేశారు. న్యాయం చేయకపోతే చచ్చిపోతాం.

– పెరుమండ్ల వీరయ్య, తలకొండపల్లి

పెన్షన్ రావడం లేదు



మా అమ్మనాన్నలిద్దరూ చనిపోయారు. ప్రస్తుతం నాకు 13 సంవత్సరాలు. రెండు కాళ్లు సక్రమంగా పని చేయవు. పెన్షన్ కోసం మా బంధువులతో అనేక మార్లు తిరిగాను. ఎవ్వరూ స్పందించడం లేదు. దివ్యాంగుల పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నా.

– సాదియాబేగం, వీరన్నపేట్



విలేకరులతో మాట్లాడుతున్న చంద్రశేఖర్

ఆలయ భూములను ఆక్రమిస్తే చర్యలు

- కబ్జాకు గురైతే సమాచారం ఇవ్వండి
- దేవాదాయ శాఖ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్

కుల్కచర్ల: ఆలయ భూములను ఆక్రమించినా, క్రయ విక్రయాలు జరిపినా కఠిన చర్యలు తప్పవని దేవాదాయ శాఖ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ హెచ్చరించారు. సోమవారం మంత్రి కొండా సురేఖ పర్యటనలో భాగంగా పాంబండ ఆలయానికి వచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ఎవరైనా దేవాలయ భూములను ఆక్రమిస్తే తమకు సమాచారం ఇవ్వాలని, అట్టి భూములను స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. ఇటీవల కబ్జాకు గురైన తాండూరు సోమేశ్వర స్వామి ఆలయ భూమి (5 ఎకరాల 27 గుంటలు)ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 467 ఆలయాలకు 15, 779 ఎకరాల భూములు ఉన్నాయన్నారు. అర్చకుల ఆధీనంలో 4,740 ఎకరాలు ఉండగా, 2,302 ఎకరాలు కౌలుకు ఇచ్చినట్లు చెప్పారు. కౌలు ద్వారా రూ. 60 లక్షల ఆదాయం వస్తోందన్నారు. సాగుకు యోగ్యం కాని భూములు 3,035 ఎకరాలు ఉన్నాయని, మరో 4,481 ఎకరాలకు సంబంధించి కోర్టుల్లో కేసులు నడుస్తున్నట్లు చెప్పారు. ఆలయాల అభివృద్ధికి అందరి సహకారంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు ప్రణీత్‌కుమార్, శాంతకుమార్, రాజేందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, బాలనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మొగిలిగిద్ద కళాశాలను అభివృద్ధి చేయండి

షాద్‌నగర్: ఇంటర్మీడియెట్ విద్యామండలి కమిషనర్ కృష్ణ ఆదిత్యను సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామస్తులు కలిశారు. ప్రొఫెసర్ హరగోపాల్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన శ్యాంసుందర్, మల్లేష్ కమిషనర్‌ను కలిసి మొగిలిగిద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధి కోసం వినతిపత్రం అందజేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గ్రామంలో పర్యటించినప్పుడు కళాశాల అభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారని తెలిపారు. వెంటనే అభివృద్ధి పనులు ప్రారంభించాలని కోరారు. సివిక్స్ పోస్టు ఖాళీగా ఉందని గెస్టు లెక్చరర్‌ను నియమించాలని, విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, టెలివిజన్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన కమిషనర్ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



ఇంటర్ విద్యా కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న, ప్రొఫెసర్ హరగోపాల్, గ్రామస్తులు

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వండి

- ప్రభుత్వ భూములను కాపాడండి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

ఇబ్రహీంపట్నం రూరల్: అన్యాక్రాంతమైపోతున్న ప్రభుత్వ భూములను కాపాడి పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. నిరుపేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జాన్‌వెస్లీ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను వెలికి తీయాలన్నారు. పేదలు ఇళ్లు లేక, జాగలు కొనలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని విమర్శించారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డీజీ నర్సింహారావు, జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సామేలు, చంద్రమోహన్, డి.జగదీష్, కందుకూరి జగన్ పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్ మొక్క నాటుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, చిత్రంలో మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

ఆయిల్ పామ్ సాగు మేలు

- మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

షాబాద్: రైతులు ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. మండల పరిధిలోని పెద్దవేడులో రైతు పీసరి అనిత సురేందర్‌రెడ్డి పొలంలో చేపట్టిన ఆయిల్ పామ్ ప్లాంటేషన్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా పది ఉమ్మడి జిల్లాల్లో ఆయిల్‌పామ్ కంపెనీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నగరానికి ఆనుకుని ఉన్న రంగారెడ్డి జిల్లా పచ్చగా ఉంటేనే తెలంగాణ మొత్తం పచ్చబడుతుందని పేర్కొన్నారు. రైతులు సాగు చేసే పంటలకు కావాల్సిన డ్రిప్ పరికరాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు ఎకరానికి ప్రభుత్వమే రూ.51వేలు ఖర్చులకు అందిస్తుందని చెప్పారు. గుడిమల్కాపూర్ మార్కెట్‌ను అజీజ్‌నగర్‌లో ఏర్పాటు చేయాలన్న ఇక్కడి ప్రజల కోరిక మేరకు ముఖ్యమంత్రితో మాట్లాడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ యస్మిన్‌భాషా, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సురేశ్, డీసీఓ సుధాకర్, చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ, పొల్యూషన్ బోర్డు మెంబర్ చింపుల సత్యనారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ఉద్యానవనశాఖ అధికారులు, ఎంపీటీసీ మాజీ సభ్యులు, మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

కల్లు దుకాణాలపై ఎక్సైజ్ దాడులు

యాచారం: కల్లు దుకాణాలపై ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. సీఐ సీతారాం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పలు దుకాణాలపై దాడులు నిర్వహించి, విక్రయించే కల్లు నాణ్యమైనదేనా అని పరిశీలించారు. కొన్ని సీసాల్లో నిల్వ ఉన్న కల్లు తీవ్ర దుర్వాసన వస్తుండడంతో పరీక్షల నిమిత్తం శాంపిల్స్ సేకరించారు. కల్తీ కల్లు విక్రయిస్తే వ్యాపారులపై కేసులు తప్పవని హెచ్చరించారు. పరిశుభ్రత లేకుండా కల్లును నిల్వ చేసి ఉంచడం, సరైన జాగ్రత్తలు తీసుకోకుండా విక్రయించి రోగాల బారిన పడేలా చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.



కల్లు దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

హెచ్‌ఎంను తొలగించాలని ధర్నా

- పాఠశాలకు చేరుకుని ఆరా తీసిన డీఈఓ
- ప్రధానోపాధ్యాయుడిని బదిలీ చేస్తున్నట్లు వెల్లడి

షాబాద్: విద్యార్థులతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ బూతు మాటలతో ఇబ్బంది పెడుతున్న షాబాద్ బాలుర పాఠశాల హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం పాఠశాలకు చేరుకున్న తల్లిదండ్రులు, గ్రామస్తులు విద్యార్థులతో కలిసి ధర్నాకు దిగారు. తమ పిల్లలను బూతు మాటలు తిడుతూ, కాళ్లతో తన్నిన హెచ్‌ఎం గోవింద్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలని భైఠాయించారు. వీరికి పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి గీత, పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ మద్దతు తెలిపారు. కలెక్టర్, డీఈఓ వచ్చేదాకా కదిలేది లేదని తేల్చిచెప్పారు. విషయం తెలుసుకున్న జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు వెంటనే అక్కడికి చేరుకున్నారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో సమావేశమై హెచ్‌ఎంపై వచ్చిన ఆరోపణలపై ఆరా తీశారు. కలెక్టర్ ఆదేశానుసారం పాఠశాలను సందర్శించి వివరాలు తెలుసుకున్నట్లు చెప్పారు. హెచ్‌ఎం గోవింద్‌ను బదిలీ చేస్తున్నట్లు తెలిపారు. గతంలోనూ ఆయనపై ఆరోపణలు తమ దృష్టికి వచ్చాయని, వాటిపై కూడా విచారణ జరిపిస్తామన్నారు. తర్వాత సుశీందర్‌రావు షాబాద్ కేజీబీవీ పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు ఆరా తీస్తున్న డీఈఓ సుశీందర్‌రావు

ప్రభుత్వ భూమిని పట్టాగా చూపించి..

- అగ్రిమెంట్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు

మొయినాబాద్: ఎనికేపల్లి భూముల వ్యవహారంలో కొత్త ట్విస్ట్ బయటకొచ్చింది. ప్రభుత్వ భూములను పట్టా భూములని చూపించి అగ్రిమెంట్ చేసిన వ్యక్తిపై మొయినాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఎనికేపల్లి గ్రామానికి చెందిన డప్పు రమేష్ గ్రామంలోని సర్వేనంబర్ 180లో ఉన్న 99.14 ఎకరాల ప్రభుత్వ భూమిని పట్టా భూమిగా చూపించి.. నకిలీ పొజిషన్ సర్టిఫికెట్లతో బంజారాహిల్స్‌కు చెందిన బి.లింగారెడ్డికి రూ.1.50 కోట్లకు విక్రయించేందుకు 2019 సెప్టెంబర్ 4న అగ్రిమెంట్ ఆఫ్ సేల్/ ఎంఓయూ చేసుకున్నారు. అగ్రిమెంట్ సమయంలో రూ.24.50 లక్షలు చెక్కుల రూపంలో, రూ.5 లక్షలు నగదు రూపంలో, తరువాత రెండు వాయిదాల్లో మిగతా మొత్తం చెల్లించారు. రిజిస్ట్రేషన్ చేయాలని ఎన్నిసార్లు అడిగినా రమేష్ తప్పించుకు తిరుగుతున్నాడు. ఇటీవల ఎనికేపల్లి భూములకు సంబంధించి పత్రికల్లో వస్తున్న వార్తలను చూసిన లింగారెడ్డి మొయినాబాద్ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి విచారించారు. 180 సర్వే నంబర్‌లోని 99.14 ఎకరాలు ప్రభుత్వ భూమి అని అధికారులు చెప్పడంతో రమేష్ మోసం చేశాడని గ్రహించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రమేష్‌పై 420, 467, 468, 120బి, 34 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వానిది రియల్ వ్యాపారం

- పేదలు సాగుచేసుకునే భూములు లాక్కుంటున్నారు
- ఎనికేపల్లి రైతులకు అండగా ఉంటాం
- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

మొయినాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా మారిందని మల్కాజిగిరి ఎంపీ, మాజీ మంత్రి ఈటల రాజేందర్ విమర్శించారు. మున్సిపల్ పరిధిలోని ఎనికేపల్లి భూములను గోశాలకు ఇవ్వొద్దంటూ రైతులు చేస్తున్న రిలే దీక్షకు సోమవారం ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే పేదలకిచ్చిన అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పుడు పేదల భూములు గుంజుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని మండిపడ్డారు. కోకాపేటలో ఉన్న గోశాలను ఎనికేపల్లికి తరలించి అక్కడ ఉన్న 50 ఎకరాల భూమిని రూ.5000 కోట్లకు అమ్మడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. దళిత, బడుగు బలహీన వర్గాలకు చెందిన రైతులు సాగుచేసుకునే భూములను వారికే పట్టాలు చేయాలని డిమాండ్ చేశారు. గోశాల ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని.. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల్లో, అటవీ భూముల్లో ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు వారికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్, పార్టీ మండల మాజీ అధ్యక్షులు గున్నాల గోపాల్‌రెడ్డి, మోర నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ రత్నం, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు శోభ, ఓబీసీ మోర్చా నియోజకవర్గం కన్వీనర్ వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్



పొలంలో సందడి చేస్తున్న విద్యార్థులు



వరి నారు తీసుకువస్తున్న చిన్నారులు

విద్యార్థుల 'పొలం బాట'

ఇబ్రహీంపట్నం రూరల్: దేశానికి అన్నం పెట్టే అన్నదాత పడే కష్టాన్ని తెలియజెప్పడంతో పాటు పంటల సాగుపై అవగాహన కల్పించే దిశగా ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యం సోమవారం విద్యార్థులు పొలంబాట పట్టించింది. వీరిని క్షేత్రస్థాయికి తీసుకెళ్లిన సిబ్బంది వరి నాటు విధానాన్ని ప్రత్యక్షంగా చూపించారు. నిత్యం పాఠశాల గదుల్లో కూర్చుని బోర్డుపై పాఠాలు వినే చిన్నారులు.. పొలంలో గంతులేస్తూ సరదాగా కొత్త పాఠం విన్నారు. స్వయంగా నారు తీసుకువచ్చి, నాటు కూడా వేశారు.

తప్పిపోయిన మహిళ.. స్నాప్‌చాట్‌తో ఆచూకీ

మీర్‌పేట: ఏడాది క్రితం అదృశ్యమైన మహిళ కేసును మీర్‌పేట పోలీసులు 'స్నాప్‌చాట్' ద్వారా ఛేదించారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. అల్మాస్‌గూడ వినాయకహిల్స్‌లో నివాసముండే ఓ మహిళ(22) కుటుంబ వివాదాల కారణంగా గతేడాది జూన్ 8వ తేదీన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి పోయింది. దీంతో ఆమె భర్త పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మహిళ ఇంట్లో నుంచి వెళ్లేటప్పుడు సెల్‌ఫోన్ కానీ, ఆమెకు సంబంధించి ఎలాంటి ఆధారాలు వెంట తీసుకెళ్లకపోవడంతో కేసును సవాలుగా తీసుకున్న మీర్‌పేట పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సదరు మహిళ మరొకరి సెల్‌ఫోన్‌లో స్నాప్‌చాట్ ఐడీని సృష్టించినట్లు పోలీసులు గుర్తించారు. సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా మహారాష్ట్ర ముంబయిలో ఆమెను అదుపులోకి తీసుకుని సోమవారం తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. అక్కడికి ఎందుకు వెళ్లిందనే విషయంపై స్పష్టత లేదు.

ప్రమాదాల నివారణకు చర్యలు

రాజేంద్రనగర్: ప్రమాదాలకు నిలయంగా మారిన రాజేంద్రనగర్ ఎన్ఐఆర్‌డీ కమాన్ చౌరస్తాను రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ, ఇన్‌స్పెక్టర్ సిహెచ్.రాజు సోమవారం సాయంత్రం సందర్శించారు. ఈ చౌరస్తాపై గతంలో ట్రాఫిక్ సిగ్నల్‌ను ఏర్పాటు చేసేందుకు దిమ్మెను నిర్మించారు. ప్రస్తుతం ఆ దిమ్మె చౌరస్తాపై ప్రమాదభరితంగా మారిందని... రాత్రి సమయంలో ఈ దిమ్మెను గమనించని వాహనదారులు దానిని ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ప్రతివారం ఈ చౌరస్తాలో ఒక ప్రమాదం చోటు చేసుకుంటుందన్నారు. ఈ విషయమై స్థానిక సంఘ సేవకుడు వేణు ట్రాఫిక్ పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. దీంతో ఏసీపీతో పాటు ఇన్‌స్పెక్టర్ సోమవారం ప్రమాదం జరుగుతున్న ప్రాంతాన్ని సందర్శించి దిమ్మెకు రేడియం స్టిక్కర్లను వేశారు. రాత్రి సమయంలో రేడియం స్టిక్కర్లను వాహనదారులు గుర్తించి ప్రమాదం నుంచి బయటపడే అవకాశం ఉంటుందన్నారు. ట్రాఫిక్ సిగ్నల్ కోసం ఏర్పాటు చేసి ఈ దిమ్మె విషయమై త్వరలోసంబంధిత అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకోనున్నట్లు ట్రాఫిక్ అధికారులు తెలిపారు.

ఊరిస్తున్న మబ్బులు



తిమ్మారెడ్డిగూడలో వాడిపోతున్న పత్తి పంట

ముఖం చాటేసిన వరుణుడు

- వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతన్నలు

షాబాద్: మబ్బులు ఊరిస్తున్నాయి.. వాన ఎప్పుడు కురుస్తుందోనని రైతులు ఆకాశం వైపు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. సాధారణంగా కాలంతో పాటు కార్తెలను నమ్ముకొని వ్యవసాయం చేస్తుంటారు. బలమైన కార్తెల్లో పంటలను సాగు చేసినట్లయితే అధిక దిగుబడులు వస్తాయని రైతుల నమ్మకం. అందుకు అనుగుణంగానే ఈ ఏడాది రుతుపవనాలు కూడా ఇరవై రోజులు ముందుగానే ప్రవేశించడంతో రోహిణి కార్తెలోనే వర్షాలు కురిశాయి. దాంతో రైతులు దుక్కులను దున్నుకొని సాగుకు సిద్ధం చేశారు. ఆ తరువాత ఆరుద్ర కార్తెలో కురిసిన అడపాదపా జల్లులకు పత్తి విత్తనాలను నాటారు. ఇరవై రోజులుగా వర్షాలు లేకపోవడంతో విత్తనాలు భూమిలోనే ఉండిపోయాయి. వాతావరణం చల్లబడుతోంది కానీ చినుకు మాత్రం నేలజారడం లేదు. దీంతో ఏం చేయాలో పాలుపోని స్థితిలో అన్నదాతలు కొట్టుమిట్టాడుతున్నారు.

జిల్లాలో లోటు వర్షపాతం

గత నెలలో జిల్లా వ్యాప్తంగా లోటు వర్షపాతం నమోదైంది. ఈ నెలలో కూడా చిరుజల్లులు మాత్రమే కురిశాయి. జూన్ నెలలో జిల్లాలో సగటున 10 రోజులు మాత్రమే వర్షం కురియగా, అధిక లోటు వర్షపాతమే రికార్డు అయింది.

పత్తికి మాత్రమే అనుకూలం

జూన్ నెలలో మొదటి, నాలుగో వారాల్లో కురిసిన మోస్తరు వర్షాలు, ప్రస్తుతం కురుస్తున్న చిరుజల్లులు పత్తి పంటకు అనుకూలంగా మారాయి. గత నెల మొదటి వారంలో కురిసిన వర్షానికి రైతులంతా పత్తి గింజలు నాటారు. పక్షం రోజులు గడిచినా వానలు కురియకపోవడంతో ఆందోళన చెందారు. ఈ క్రమంలోనే జూన్ చివరి వారం, ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో పత్తి పంటలకు ప్రాణం పోసినట్లు అయింది.

వరి సాగు ఆలస్యం

సీజన్ ప్రారంభం నుంచి వర్షాలు కురియకపోవడంతో వరి సాగు ఆలస్యం అవుతుంది. గత నెల చివరి వారంలో కురిసిన వర్షాలకు కొందరు రైతులు వడ్లను అలికారు. ప్రస్తుతం వరి పైరు నారు దశలో ఉంది. మరిన్ని వర్షాలు కురిస్తే నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. బోర్లు ఉన్న రైతులు నాట్లు వేసేందుకు కూడా రెడీ అవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా బోర్లు లేని కర్షకులు ఇప్పటికీ వడ్లు అలకకుండా మరిన్ని వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు.

వానలు పడితేనే సాగు



నాకున్న రెండు ఎకరాల పొలం సాగు చేసేందుకు వడ్లు అలికిన. వరి నారు ఎదిగి నాటేందుకు రెడీగా ఉంది. ఇప్పుడు పడుతున్న చిన్నచిన్న వర్షానికి పైరుకు ఎటువంటి ఇబ్బంది లేదు. పొలం మొత్తం తడవలేదు. ఈ నెలల్లో వర్షాలు ఎక్కువగా పడితేనే వరినాట్లు వేద్దామని అనుకుంటున్నా.
– చంద్రబాబు, రైతు, షాబాద్

మొలకెత్తలేదు



రోహిణి కార్తెలో తప్పా ఇప్పటివరకు సరైన వర్షమే కురవలేదు. ఇటీవల కురిసిన జల్లులకు కార్తెలు పోతున్నాయని విత్తనాలు విత్తితే అవి మొలకెత్తలేదు. మరలా విత్తుదామంటే వర్షాలు లేవు. ఇప్పటికే 8 ఎకరాలలో పత్తి సాగు చేశాను. రూ.1.20 లక్షలు పెట్టుబడి పెట్టాను.
– శేఖర్, రైతు, తిమ్మారెడ్డిగూడ

బీఆర్‌ఎస్‌కే ప్రజల మద్దతు



ఎమ్మెల్యే సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన నాయకులు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి
- బీఆర్‌ఎస్‌లోకి పలువురి చేరిక

చేవెళ్ల: రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్ పాలనే కావాలని ప్రజలు కోరుకుంటున్నారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితారెడ్డి అన్నారు. నగరంలోని ఆమె నివాసంలో సోమవారం మండలంలోని ముడిమ్యాలకు చెందిన కాంగ్రెస్‌పార్టీ నాయకులు, యువకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసుగు చెందిపోయారన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయటంతో పూర్తిగా విఫలమయ్యారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల పని రాష్ట్రంలో అయిపోయిందని మళ్లీ బీఆర్‌ఎస్ పాలనే కావాలని ప్రజలు కోరుకుంటున్నారు. అందుకే వలసలు పెరుగుతున్నాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో బీఆర్‌ఎస్ పార్టీ పోటీ చేసి సత్తాను చాటుకుంటుందన్నారు. పార్టీలోకి వచ్చిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ క్రిష్ణారెడ్డి, నాయకులు ఆంజనేయులు, ప్రభాకర్, నారాయణ, రాజు, శశిపాల్, వెంకటేశ్, క్రిష్ణ, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మరోపక్క చేవెళ్లలోని పార్టీ కార్యాలయం వద్ద రాష్ట్ర యువ నాయకుడు కార్తీక్‌రెడ్డి సమక్షంలో రేగడిఘనాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ పార్టీల నుంచి యువకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు



విద్యార్థి సంఘం నేతలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

చేవెళ్లలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా

చేవెళ్ల: విద్యారంగ సమస్యలను పరిష్కరించి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం కళాశాలల విద్యార్థులతో కలిసి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడుస్తున్నా నేటికీ విద్యాశాఖ మంత్రిని నియమించకపోవటం దురదృష్టమన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.8,700 కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ వెంటనే విడుదల చేయాలన్నారు. గతంలోనే పలు మార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా స్పందించకపోతే ముఖ్యమంత్రి ఇల్లు ముట్టడికి పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న కళాశాలల విద్యార్థులతో చేవెళ్ల ప్రధాన రహదారిపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులు జోక్యం చేసుకొని విద్యార్థి సంఘం నాయకులను అరెస్ట్ చేసి ధర్నాను విరమింపజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సమీర్, యశ్వంత్, చరణ్‌గౌడ్, చందు, తేజ, చిరంజీవి, ప్రశాంత్, ఆకాశ్, సోఫియాన్, మోసిన్, అజర్, వంశీ, సాయి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నర్సింలు (ఫైల్)

చేవెళ్ల: ముందు వెళ్తున్న కారు సడెన్ బ్రేక్ వేయటంతో వెనక నుంచి బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చనువెల్లి గ్రామానికి చెందిన తలారి నర్సింలు(38) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆదివారం రాత్రి తన బైక్‌పై చేవెళ్లకు వెళ్తుండగా పామెన బస్‌స్టేజి సమీపంలోని పెట్రోల్ బంకు సమీపంలో ముందు వెళ్తున్న కారు డ్రైవర్ సడెన్ బ్రేక్ వేశాడు. దీంతో నర్సింలు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్‌పై నుంచి ఎగిరి కిందపడి తీవ్రంగా గాయపడిన నర్సింలును చేవెళ్లలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య నలుగురు పిల్లలు ఉన్నారు. పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

షాబాద్: విద్యుదాఘాతంలో పాడి గేదె మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నాన్‌చెరూర్‌ఖాన్‌పేట్‌లో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మేకల మహేందర్ తన పాడి గేదె పొలంలో మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు తెగిపడిన విద్యుత్ వైర్లకు తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్ స్తంభాలతో సహా వైర్లు కిందపడినా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నారు.

జారి పడి కూలీ మృతి

గచ్చిబౌలి: గ్రిల్‌పై కూర్చుని ఫోన్ మాట్లాడుతూ ఓ కూలీ ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఝార్ఖండ్, చత్ర జిల్లా, సిల్‌డాగ్‌కు చెందిన సుఖి భయాన్(26) తన సోదరుడు చర్కు కుమార్‌తో కలిసి నగరానికి వలస వచ్చారు. గోపన్‌పల్లిలో అపర్ణ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో కూలీగా పని చేస్తూ ఎన్‌టీఆర్ నగర్‌లో లేబర్ క్యాంప్ సి–2లో నివాసం ఉంటున్నారు. ఆదివారం రాత్రి మొదటి అంతస్తులో గ్రిల్‌పై కూర్చుని ఫోన్ మాట్లాడుతూ జారి కింద పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. మొదట సిటిజన్ ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మట్టి తరలిస్తున్న వాహనాలు సీజ్

దోమ: అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తున్న వాహనాలను టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం రాత్రి పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ అన్వర్ పాషా తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఊటుపల్లి గ్రామ సమీపంలో కొందరు టిప్పర్లలో మట్టిని నింపి యథేచ్ఛగా తరలిస్తున్నారని సమాచారం అందిందన్నారు. ఈ మేరకు సిబ్బందితో కలిసి అక్కడి చేరుకొని ఐదు టిప్పర్లు, ఓ జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. వాహనాలను స్థానిక పోలీసులు సీజ్ చేసి ఏడుగురిపై కేసు నమోదు చేశారు. అక్రమ మట్టి వ్యాపారం చేస్తే ఉపేక్షించేది లేదని టాస్క్‌ఫోర్స్ సీఐ హెచ్చరించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మొయినాబాద్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మొయినాబాద్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం అన్నారు. మొయినాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై సోమవారం ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. పెండింగ్ చలాన్లను వాహనదారులతో కట్టించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించవద్దన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. తనిఖీలు నిర్వహించినవారిలో ట్రాఫిక్ ఏఎస్సైలు, కానిస్టేబుళ్లు ఉన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీని అరికట్టండి

డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జగన్



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: జిల్లాలో విచ్చలవిడిగా ప్రైవేట్ ఆస్పత్రుల ఫీజుల దోపిడీని అరికట్టాలని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టర్ నారాయణరెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి.జగన్ మాట్లాడుతూ.. ఫీజుల దోపిడీ విచ్చలవిడిగా కొనసాగుతుందన్నారు. ప్రజల అవసరాన్ని అవకాశంగా తీసుకొని రూ.లక్షలు దండుకుంటున్నారని మండిపడ్డారు. అవసరం లేని టెస్టులు, మందులు ఇస్తున్నారన్నారు. ఆపరేషన్లు అవసరం లేకున్నా ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఆస్పత్రిలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర్, సభ్యుడు రాఘవేందర్, మహేష్, వినోద్, శ్యామ్ పాల్గొన్నారు.

బ్రేక్ డౌన్.. ట్రాఫిక్ జాం

గచ్చిబౌలి: రద్దీ సమయాల్లో వాహనాలు రోడ్లపై బ్రేక్‌డౌన్ అవుతుండడంతో ట్రాఫిక్ జాం నెలకొంటుంది. వాహనాల రాకపోకలకు అంతరాయం కల్గుతోంది. సోమవారం ఉదయం 10.10 గంటల సమయంలో గచ్చిబౌలి ఫ్లై ఓవర్‌పై ఓ ప్రైవేట్ బస్సు బ్రేక్‌డౌన్ అవడంతో టెలికాంనగర్ నుంచి ఇందిరానగర్ వైపు వెళ్లే వాహనాల రాకపోకలకు ఆటంకం కల్గింది. మాదాపూర్, కూకట్‌పల్లి, మెహిదీపట్నం తదితర ప్రాంతాల నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, లింగంపల్లి వైపు వెళ్లే వాహనాల రాకపోకలు మందకొడిగా సాగాయి. మరమ్మతులు చేసిన అనంతరం రాయదుర్గం ట్రాఫిక్ పోలీసులు బస్సును పక్కకు తరలించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

దుద్యాల్: తల్లిదండ్రులు మందలించారనే మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండల పరిధిలోని హస్నాబాద్‌లో సోమవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు, కొడంగల్ ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన చాకలి వెంకటమ్మ, ఇస్తప్పకు ముగ్గురు కుమారులు. వ్యవసాయం చేసుకునే తల్లిదండ్రులకు పెద్ద కుమారుడు నవీన్(24) చేదోడువాదోడుగా ఉండేవాడు. ఇటీవల తన బైక్‌పై గుజరాత్, ఆరుణాచలంతో పాటు ఇతర సుదూర ప్రాంతాలకు వెళ్లి వచ్చాడు. ఈ విషయమై తల్లిదండ్రులు అతన్ని మందలించారు. బైక్‌పై వందల కిలోమీటర్ల ప్రయాణం సురక్షితం కాదని, ప్రమాదాలు జరిగే అవకాశంతో పాటు ఆరోగ్యం పాడవుతుందని చెప్పారు. పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాల పేరుతో మరోసారి బైక్‌పై వెళ్లొద్దని సూచించారు. దీంతో మనస్తాపానికి గురైన నవీన్ సోమవారం ఉదయం పొలానికి వెళ్లి చెట్టుకు ఉరేసుకున్నాడు. చేతికి వచ్చిన చెట్టంత కొడుకు ఇలా చేస్తాడని ఊహించలేదని బాధిత తల్లిదండ్రులు రోదించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు. యువకుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఔషధ మొక్కలకు భారతదేశం పుట్టినిల్లు



మోడల్ స్కూల్‌లో ఔషధ మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కందుకూరు: ఔషధ మొక్కలకు భారతదేశం పుట్టినిల్లని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విష్ణుప్రియ అన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న యంగ్ ఎర్త్ లీడర్ ప్రోగ్రాంలో భాగంగా సోమవారం మండలంలోని నేదునూరు మోడల్ స్కూల్‌లో 20 రకాల ఔషధ మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రపంచానికి వైద్యాన్ని, ఔషధాన్ని పరిచయం చేసిన గొప్ప దేశం మనదని కొనియాడారు. రోజు వారి దినచర్యలో ఔషధ మొక్కల వినియోగం ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని, వాటి ద్వారా పొందే ప్రయోజనాలు విద్యార్థులకు వివరించడానికి మెడిసినల్ గార్డెన్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గురురాజారెడ్డి, పుష్పలత, శ్రీనివాసాచారి, సురేష్, కొండల్‌రావ్, దామోదర్, వెంకటరమణ, జ్యోతి, సునీత, శేఖర్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ రజనీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు కింద పడి విద్యార్థిని దుర్మరణం

జగద్గిరిగుట్ట: ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు కింద పడి ఓ విద్యార్థిని మృతి చెందిన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి వరంగల్‌కు చెందిన వంగాల రూపేష్ కుమార్, లక్ష్మీ దంపతులు ఆల్విన్ కాలనీ సాయిబాబా ఆలయ సమీపంలో నివాసం ఉంటున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె సంతానం. కుమార్తె శ్రీజ(16) కూకట్‌పల్లిలోని ఎస్ఆర్ జూనియర్ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. సోమవారం ఉదయం ఆమె కాలేజీకి వెళ్లేందుకు ఆల్విన్ కాలనీ రోడ్డులోని బస్టాప్‌కు వచ్చింది. అదే సమయంలో కదిలేందుకు సిద్ధంగా ఉన్న ఉప్పల్ డిపోకు చెందిన బస్సు ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా అదుపుతప్పి కింద పడింది. బస్సు టైర్లు ఆమె మీదుగా వెళ్లడంతో తీవ్రంగా గాయపడింది. దీనిని గుర్తించిన స్థానికులు ఆమెను సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కొద్ది సేపటికే మృతి చెందింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

దోమ: సాగులో వాడే క్రిమి సంహారక మందు తాగి ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వెంకటయ్య, బాలమణి దంపతులకు శ్రీకాంత్(27) ఏకైక కుమారుడు. అతను కొంత కాలంగా కడుపునొప్పితో తీవ్రంగా బాధపడుతూ ఇబ్బందులకు గురవుతుండేవాడు. దీంతో మనస్తాపం చెందిన ఆయన ఈ నెల 12వ తేదీ రాత్రి ఊటుపల్లి గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో పురుగుల మందు తాగాడు. విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి నగరంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు డిగ్రీ వరకు పూర్తి చేసి కుటుంబ సభ్యులకు చేదొడు వాదొడుగా ఉండేవాడు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యాంతమయ్యారు.